# కనిపెట్టు గంట

## (కనిపెట్టు గంట అనగా దేవుని సన్నిధిలో మోకాళ్ళని కనిపెట్టవలసిన సమయము)

మనమొక అధికారియొద్దకు వెళ్లి, 'ఐదు రూపాయలు దయచేయండి' అని అడిగినయెడల, ఆయన ఇచ్చునని గాని, ఇయ్యడనిగాని తెలియక ముందు వచ్చివేయముగదా! ఆవిధముగానే మనము దేవుని సన్నిధికి వెళ్ళి మనకు కావలసినవి దయచేయుమని ప్రార్థించి, ఆయన మన మనసులో ఏదైన ఒక తలంపు కలిగించువరకు, మోకాళ్లమీదనే ఉండవలెను గాని ఆమేన్ అని వచ్చివేయుట మర్యాదకాదు. "సత్యమనగా ఏమిటని" పిలాతు యేసుక్రీస్తు ప్రభువును ఒక ప్రశ్న అడిగెను. ఆ ప్రశ్నకు ప్రభువు జవాబియ్యకముందే ఆయన ఇంటిలోనికి వెళ్ళిపోయెను. జడ్జిగారింకను కనిపెట్టుకొనియున్న యెడల, ప్రభువేమి జవాబిచ్చునో అది సువార్తికులు వ్రాసియుందురు. మనము తెలిసికొని యుందుము. ***అవతలివారు పలుకువరకు మనము పిలుచుచునే యుందుముగదా! కనిపెట్టుకొనియే యుందుముగదా!*** పలికిన వెంటనే పిలుచుట మానివేయుదుము. పూర్వికులైన ప్రవక్తలు దేవుని సన్నిధిలో ఎంతోసేపు కనిపెట్టియుందురు! వారట్లు కనిపెట్టబట్టియే గొప్పగొప్ప ప్రవచన గ్రంథములు వ్రాయగలిగిరి, దేవుని అభిప్రాయములు తెలిసికొనగలిగిరి. తమ అభిప్రాయములలో *పొరబాట్లుండునుగదా! కనిపెట్టిన పిమ్మట ప్రార్థించినామను సంతోషమేగాక, దేవుడు జవాబిచ్చినాడను సంతోషముకూడ మనకు కలుగును.* ***ప్రార్థనలో కనిపెట్టువాడుక సంఘములో సంఘనాయకులు ప్రవేశపెట్టలేదు. ఇది గొప్పలోపము.*** అక్కడక్కడ కొంతమంది విశ్వాసులకు మాత్రమే ఈ వాడుక గలదు. కాని సంఘమంతటికిలేదు. ఇప్పుడైనను సంఘమంతట ఈ వాడుకను ప్రవేశపెట్టినయెడల

సంఘముయొక్క విశ్వాసమును, ఆనందమును ఎంతో వృద్ధియగును. కనిపెట్టు గంటలో అన్నియు పరిష్కారమగును. నీ కఠిన ప్రశ్నలన్నిటికి జవాబు దొరుకును. ఏదైన ఒక సంగతిమీద 'దేవునికొరకు కనిపెట్టవలయునను' విషయము బైబిలులోగలదు. కనిపెట్టుటను గురించి బైబిలులోయున్న వాక్యములు చదివినయెడల ఇది తేలును. *మన మనసులోనున్న సంగతి నెరవేరు వరకు కనిపెట్టవలసిన కాలము ఒక గంటమాత్రమే అయ్యుండదుగదా! మరియు అది ఒక అరగంటకూడ అయ్యుండవచ్చును గదా!*

*"ఈ కీడు యెహోవాచేత కలుగుచున్నది. నేను ఇక ఎందుకు యెహోవా కొరకు కనిపెట్టియుండవలెనని"* ఒక అవిశ్వాసి పలికినట్లు మనమును పలుకకుందుముగాక! (II రాజులు 6:33). ఇదివరకున్న మతాచారవిధులే మేము నెరవేర్చలేక పోవుచుండగా, మీరీ క్రొత్త ఆచారమొకటి తెచ్చిపెట్టినారు. ఇదెట్లు నెరవేర్ప వీలుండునని ఎదురు చెప్పువారికి మేమేమి చెప్పగలము? చేసి చూడండని మాత్రమే చెప్పగలముగాని వాగ్వాద ప్రశ్నలకెట్లు సమాధానము చెప్పగలము? ఎంత చెప్పినను వంకలు తెచ్చువారు ఉండకపోరు. అయినను అవి వినక, 'కనిపెట్టువేళ నీ నిమిత్తమై కనిపెట్టుకొని యున్నట్లు భావించుకొని, కనిపెట్టుచోటికి వెళ్ళుము. ***ప్రభువు రాకడ మిగుల సమీపమని నమ్మువారు సిద్ధపడుటకు కనిపెట్టు సమయమొక గొప్ప సాధనమని మా తాత్పర్యము.*** కనిపెట్టుగంట సర్వమతముల వారికిని, నాస్తికులకును, భక్తులకును, మానవజన్మమెత్తిన ప్రతివారికిని ఉపయోగమే.

**1. బోధవినుట అనిష్టము :** సద్బోధ వినుటకు నీకిష్టము లేకపోవచ్చును. ఇది ఒక దుర్బుద్ధి. ఇది దుర్బుద్ధి అని తెలిసినను ప్రార్థనలో కనిపెట్టుట మానవద్దు. దేవుడిచ్చిన రోజులోని 24గంటలలో, ఒక గంటయైనను కనిపెట్టుటయందు గడపలేవా? కనిపెట్టగా

కనిపెట్టగా, బోధయందు ఇష్టము కలుగును. కనిపెట్టుటవలన నీ బ్రతుకు ఎంత శుభకరముగా వర్ధిల్లునో తెలిసికొనగలవు.

**2. పాపములు ఒప్పుకొనుట అనిష్టము:** నీది తప్పు అని తెలిసికొనినను, తప్పు ఒప్పుకొనుటకు ఇష్టపడవు. ఇదియొక దుర్బుద్ధి. ఇంత పాపము పెట్టుకొని, తగుదునని ఎట్లు కనిపెట్టు స్థలమునకు వెళ్ళగలనని అనుకొనవద్దు. **వెళ్ళుము, మోకరించుము, కనిపెట్టుము,** అప్పుడు పాపములు ఒప్పుకొనుటకు నీకిష్టము కలుగును.

**3. పాపములు విసర్జించుట అనిష్టము :** నీవు వదలజాలని పాపమేదోయొకటి నీలోనుండవచ్చును. ఎన్ని పాపములైనను *విసర్జింపగలవు గాని అది విసర్జింపలేవు.* దానిని విసర్జించుట నీకిష్టమై యుండదు. ఇది నీమీద ఏలుబడిచేయు పాపమైయుండును. అది నిన్ను చిక్కులుపెట్టు పాపము. అయినను ఉదయముననే లేచి, శరీరశుద్ధి గావించుకొని, పాపములేనివానివలె దైవసన్నిధిలోనికి పరుగెత్తుము, కనిపెట్టుము. ఆ నీ పాపముమీద అప్పుడు నీకు అసహ్యత కలుగును. నీకది బానిసయగును. నీవే దానిని ఏలుబడిచేయుదువు.

**4. పాపమును గెలువలేని బలహీనత :** పాపమున్నది. దానిని విసర్జించుట నీకు ఇష్టమే. గెలువవలెనని ఎన్నోవారులు ప్రయత్నించినావు. ఎంతోమందిచేత ప్రార్థన చేయించుకొన్నావు. అయినను గెలువలేకపోవు చున్నావు. దిగులుపడకుము కనిపెట్టు సమయములో నీవు బాగుపడుదువు. *'పాపమును గెలువలేని నీకెందుకు ఇక కనిపెట్టుటని',* నిన్నెరిగినవారందురు. అయిననూ, బెదిరిపోవద్దు: సన్నిధిలోనికి వెళ్ళుము కనిపెట్టుము, అపుడు కనిపెట్టుఫలమును పొందుదువు.

**5. బైబిలు చదువుట అనిష్టము :** ఒకానొక సమయమందు బైబిలు చదువుటకు నీకిష్టము కలుగదు. ఇదియొక దుర్బుద్ధి. ఇది

దుర్బుద్ధియని నీవు నమ్మినను, కనిపెట్టుగంట మరచిపోవద్దు. వెళ్ళుము, ఒక గంటసేపు దేవుని సన్నిధిలో మోకాళ్ళమీదనే కనిపెట్టుము, తుదకు బైబిలు చదువుటయందు నీకిష్టము కలుగును.

**6. ప్రార్థనచేయుట నీకు అనిష్టము :** ప్రార్థన చేయుటకు ఒకానొకప్పుడు ఏమియు ఇష్టముండదు. బలవంతముగా చేయబోయినను మాటలే రావు. ఇదియొక బలహీనత. అయినను ఒకగంట కనిపెట్టుట మానవద్దు. 'అయ్యో! ప్రార్థనమీద ఇష్టము లేకపోవుచున్నది. ఎట్లు కనిపెట్టగలనని' అందువేమో! ఫరవాలేదు. వెళ్ళి కనిపెట్టుము. అప్పుడు నీకు ప్రార్థనయందు ఇష్టము కలుగును.

**7. సువార్త ప్రకటించుట అనిష్టము :** నీకు సువార్త తెలుసును. నీ హృదయము సరిగానే యున్నది. ఎందుచేతనోగాని సువార్త ప్రకటించుట నీకిష్టములేదు. 'వారికి సువార్త ప్రకటించిన, విందురా' అని అందువు. ఇదియు దుర్బుద్ధియే. సువార్తవలన మేలుపొందిన నీవు ఇతరులు మేలు పొందుటకు ఇష్టపడనియెడల అది దుర్బుద్ధికాక మరేమిబుద్ధి? అయినను నీగదిలోనికి వెళ్ళుము. కనిపెట్టుటయను గొప్ప కార్యమును చేయుము. అప్పుడు సువార్త బోధించుటకు నీకిష్టమగును.

**8. విశ్వాసములేని స్థితి:** ఒకానొకప్పుడు దైవ విషయములయందు ఏమియు విశ్వాసము గలుగదు. ఏ మతమును నిజముకాదని తోచును: 'దేవుడున్నట్టు, మోక్షమున్నట్టు, నరకమున్నట్టు ఎవరు చూచినారు? క్రీస్తు వచ్చినట్టు చూచినవారేరి'? అనునిట్టి అవిశ్వాస ప్రశ్నలు మనసులో పుట్టును. ఇట్టి ప్రశ్నలతోనే కనిపెట్టు స్థలమునకు వెళ్ళుము. సందేహింపకుము. కనిపెట్టుము. కనిపెట్టగా నీ ప్రశ్నలన్నియు అంతరించిపోవును. స్థిర విశ్వాసము కలుగును.

**9. నిరాశ:** నీ కథలు తెలిసిన ఒక బోధకుడు నీకు దారిలో కనబడి, 'ఓదురంతకుడా! దేవుడు నీకు రక్షణ అనుగ్రహించనప్పుడు

నీవెక్కడికి వెళ్ళుదువు? నీవు రక్షణను నిర్లక్ష్యపెట్టుచున్నావు. నీకు మారుమనస్సు కలుగుట దుర్లభము, అని పలుకును. అప్పుడు నీ ముఖములో కళ తగ్గును. నీ గుండె కొట్టుకొనును. రాత్రులు నీ స్వప్నములలో దయ్యములు కనబడును. చావుపెట్టె కనబడును నరకము, నరకము అను శబ్ధము వినబడును. వెర్రికేకలు వేయుదువు అంతలో మెళుకువ వచ్చును. ఏమి చేయుదువు? నిరాశపడుదువు గదా? ఆ బోధకుని మాటలను, దుష్టస్వప్నములను మందలింపు క్రింద లెక్కకట్టుకొనుము: వెళ్ళుము, కనిపెట్టు గదిలో ఉండుము విశ్వాసము వచ్చువరకు. అప్పుడు నీ మనస్సులో ధైర్యము, సంతోషము కలుగును.

**10. విసుగుదల:** "నేను ఒకసంగతిని గూర్చి ఎన్నో రోజులనుండి ప్రార్థించుచున్నాను, విశ్వాసముతో అడుగుచున్నాను. నాకు తెలిసినంత మట్టుకు నాలో ఏ అడ్డములేదు. అయినను దేవుడు నా ప్రార్థన ఆలకించుట లేదు ఎందుకో తెలియదు. దేవుని వాగ్ధానములు చూడగా నోరూరుచున్నదని'' ఈ రీతిగా దేవునిమీద విసుగుకొనుచున్నావుగదా! ***ఇది ఒక నీరస బుద్ధి.*** కనిపెట్టుచోటునకు వెళ్ళుము. నీ మనసుకు శాంతి కలుగును. దేవుని యెడల నీకు మంచి అభిప్రాయములు పుట్టును.

**11. అసూయ:** 'నేనెన్నోమారులు ప్రార్థించగా దేవుడు వినలేదు గాని, వీరు ప్రార్థింపగానే విన్నాడు' అని ఇతరులమీద అసూయపడుదువు. దేవుడు పక్షపాతియని తలంతువు. ఇవియు దుర్బుద్ధులే. అయినను సన్నిధిలోనికి వెళ్ళుటకు జంకకుము కనిపెట్టుము. ఈ దుర్గుణములు నివారణయగును.

**12. వీలులేనిస్థితి:** కనిపెట్టవలెనననిన అన్నియు అడ్డములే. మనసు కుదరదు, స్థలము దొరకదు, స్థలము దొరికినను అందరి మాటలు వినబడుచుండును. స్థలము దొరికిన సమయము దొరకదు

సమయము దొరికిన స్థలము దొరకదు. స్థలము, సమయము దొరికిన, నిద్ర నిద్ర అని అనుకొందువేమో: **విస్తారముగా ఆలోచింపకుము. చొరవచేసికొని ఎక్కడో ఒకచోట ఇరుకుకొనుము. కనిపెట్టుము.** కనిపెట్టుటయందు నీకిష్టమున్నదని నీ తండ్రికి తెలుసుగదా! నీ ఆశకు విలువగలదు. వీలులేకపోయినను బలవంతముగా వీలు కలుగజేసికొనుము. *పనులకు వీలు కలుగజేసికొనుచున్నావు గదా! కనిపెట్టుటకు వీలు కలిగించుకొనలేవా?* ఇట్లు నీవు కనిపెట్టు అలవాటు కలిగియున్నయెడల క్రమేణ చెడుగంతయు ఒత్తిగిలిపోవును. మంచి నీ జీవితములో ప్రవేశించును దైవాత్మ నీకు సహాయము చేయును. నా సలహా ప్రకారము నీవు చేసినందుకు విచారపడవు. దేవుని సన్నిధిలో గడిపిన సమయము వృధాగా గడిపిన సమయమని భావించుకొనవద్దు. ఒకసారి కనిపెట్టగా నెమ్మది దొరకకపోయినయెడల, మరియొకసారి కనిపెట్టుము అశ్రద్ధ చేయవద్దు.

**13. కృపను లోకువకట్టు స్థితి:** కనిపెట్టు గదియొకటి ఉన్నది గదా! గనుక ఎన్ని పాపములైనను చేసికొనవచ్చును. (అలాగు పాపములు) చేసి కనిపెట్టు గదిలోనికి వెళ్ళినయెడల, పాపములన్నియు, పరిహారమగునని అనుకొందువేమో! ఇట్లనుకొనుట దేవుని కృపను లోకువకట్టుటయైయున్నది. ఇది అపాయకరమైన స్థితి. నేను నీకు సదుపాయము చూపించుచుండగా నీవట్లనుకొనకూడదు. కనిపెట్టు స్థలమునకు వెళ్ళుము కనిపెట్టుము మేలు కలుగకమానదు.

**14. కనిపెట్టు సమయమున కలుగు భాగ్యము:** కనిపెట్టు సమయములో ఒకరికి పాపములప్పుకొను వాలుకలిగినది. ఒకరికి ప్రార్ధన ధోరణి కలిగినది. ఒకరికి స్తుతిచేయు ప్రవాహము వచ్చినది. ఒకరికి దర్శనవరము లభించినది. ఈ ప్రకారముగా ఒక్కొక్కరికి ఒక్కొక్క భాగ్యము కలిగినది. ఎన్ని భాగ్యములో వివరింపలేము. **మేము వ్రాసినది**

***తక్కువైనను ఎక్కువ గ్రహించుకొనవలెను.*** ఈ పత్రికలో మేము వ్రాసిన బలహీనతలు గలవారు మాత్రమేకాదు, లేనివారును ఈ కనిపెట్టు సమయమును ఉపయోగించుకొనవలెను. కీర్తనలు పాడుకొనుట, ప్రార్థనలు చేసికొనుట, బైబిలు చదువుకొనుట అనుపనులు, తత్పూర్వమే అనగా కనిపెట్టుకొనుటకు ముందుగానే ముగించుకొనుట మంచిది. తరువాతకూడ చేసికొనవచ్చును. ఎవరి వీలుకొలది వారు చేసికొనవచ్చును. ***కనిపెట్టు సమయములో దైవసహవాసానుభవము కలుగును.*** ఏలీయా తన ప్రార్థన నెరవేరు వరకును, కర్మెలు కొండమీద కనిపెట్టుకొని ప్రార్థన సాగించుచూనే యుండెను. మొదటిమారు ప్రార్థనకు నెరవేర్పు కనబడనప్పుడు రెండవమారు ప్రార్థనచేసెను. ***ఈ ప్రకారముగా ఏడుమారులు ప్రార్థన చేయుచునే, నెరవేర్పుకొరకు కనిపెట్టెను. తుదకు నెరవేర్పు కలిగెను*** (I రాజులు 18అధ్యా॥).

**మూడు సంగతులు:** 1) కనిపెట్టుగదిలో మనోనిదానము కలిగియుండుము అనగా చెడు తలంపులు రానీయకుము, మంచి సంగతులుకూడ జ్ఞాపకము చేసికొనకుము. *తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు నీ ఎదుట ఉన్నారను ఒక తలంపు మాత్రమే చివరవరకును ఉండవలెను.* ఇదే నీవక్కడ చేయవలసిన గొప్పపని. యత్నించుము. 2) ఎన్నో రోజులనుండి కనిపెట్టు గంటను వాడుకొనుచున్నాను. నాకేమియు అనుభవము కలుగలేదని అనుచున్నావు. అట్లు కనిపెట్టుటయే నీకు కలిగిన మొదటి భాగ్యముకదా! 3) కనిపెట్టుగంట అభ్యాసము గలిగిన వారితో మాటలాడినయెడల కొన్ని సంగతులు నేర్చుకొనగలవు.

# కనిపెట్టు వాక్యములు

1. నీకొరకు కనిపెట్టువారిలో ఎవడును సిగ్గునొందడు. (కీర్తన 25:3).

2. యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము. ధైర్యము తెచ్చుకొని నీ హృదయమును నిబ్బరముగా నుంచుకొనుము. యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము (కీర్తన 27:14).

3. యెహోవా ఎదుట మౌనముగానుండి ఆయనకొరకు కనిపెట్టుకొనుము (కీర్తన 37:7).

4. దేవా! సీయోనులో మౌనముగా నుండుట నీకు స్తుతి చెల్లించుటే, (కీర్తన 65:1).

5. నా దేవునికొరకు కనిపెట్టుటచేత నా కన్నులు క్షీణించిపోయెను (కీర్తన 69:3).

6. ఆయన కార్యములను వెంటనే మరచిపోయిరి. ఆయన ఆలోచనకొరకు కనిపెట్టుకొనకపోయిరి (కీర్తన 106:13).

7. యెహోవాకొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు. వారు పక్షిరాజులవలె రెక్కలుచాపి పైకి ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు. సొమ్మసిల్లక నడిచిపోవుదురు (యెషయా 40:31).

8. తనకొరకు కనిపెట్టువాని విషయమై, నీవు తప్ప తన కార్యము సఫలముచేయు మరి ఏ దేవునిని, ఎవడు నేకాలమున చూచియుండలేదు. అట్టి దేవుడు కలడన్న సమాచారము మనుష్యులకు వినబడలేదు. అట్టి సంగతి వారికి తెలిసియుండలేదు (యెష. 64:4).

9. ఆయన నాకు ఏమి సెలవిచ్చునో, నా వాదము విషయమై నేనేమి చెప్పుదునో చూచుటకై నేను నా కావలి స్థలముమీదను,

గోపురముమీదను, కనిపెట్టుకొని యుందుననుకొనగా యెహోవా నాకు ఈలాగు సెలవిచ్చెను– 'చదువువాడు పరుగెత్తుచు చదువవీలగునట్లు నీవు ఆ దర్శన విషయమును పలకమీద స్పష్టముగా వ్రాయుము. ఆ దర్శన విషయము నిర్ణయకాలమున జరుగును, సమాప్తమగుటకై ఆతుర పడుచున్నది, అది తప్పక నెరవేరును. అది ఆలస్యముగా వచ్చినను దానికొరకు కనిపెట్టుము. అది తప్పక జరుగును, జాగుచేయక వచ్చును (హబక్కూకు 2:1–3).

10. ఆయన వారిని కలిసికొని ఈలాగు ఆజ్ఞాపించెను– 'మీరు యెరూషలేమునుండి వెళ్ళక, నావలన వినిన తండ్రియొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి' (అపో.కార్య. 1:4).

11. యెహోవా, నీ రక్షణకొరకు కనిపెట్టియున్నాను (ఆది.కా. 49:18).

12. ప్రభువా! సైన్యములకధిపతివగు యెహోవా, నీ కొరకు కనిపెట్టుకొనువారికి నావలన సిగ్గు కలుగనియ్యకుము (కీర్తన 69:6).

13. యెహోవాకొరకు కనిపెట్టుకొని యుండుము. ఆయన మార్గము ననుసరించుము. భూమిని స్వతంత్రించుకొనునట్లు ఆయన నిన్ను హెచ్చించును. భక్తిహీనులు నిర్మూలము కాగా నీవు చూచెదవు (కీర్తన 37:34).

14. నా ప్రాణము దేవుని నమ్ముకొని మౌనముగా ఉన్నది. ఆయనవలన నాకు రక్షణ కలుగును (కీర్తన 62:1).

15. నీవు దానిని నెరవేర్చితివి గనుక నేను నిత్యము నిన్ను స్తుతించెదను. నీ నామము నీ భక్తుల దృష్టికి ఉత్తమమైనది. నేను దానిని స్మరించి కనిపెట్టుచున్నాను (కీర్తన 52:9).

16. తగినకాలమున నీవు వాటికి ఆహారమిచ్చెదవని, ఇవన్నియు నీ దయకొరకు కనిపెట్టుచున్నవి (కీర్తన 104:27).

17. దాసుల కన్నులు తమ యజమానుని చేతితట్టును, దాసి కన్నులు తన యజమానురాలి చేతితట్టును చూచునట్టు, మనదేవుడైన యెహోవా మనలను కరుణించువరకు, **మన కన్నులు ఆయనతట్టు చూచుచున్నవి** (కీర్తన 123:2).

18. కీడునకు ప్రతికీడు చేసెదననుకొనవద్దు. యెహోవా కొరకు కనిపెట్టుకొనుము. ఆయన నిన్ను రక్షించును. (సామెతలు 20:22).

19. కావున మీయందు దయజూపవలెనని యెహోవా ఆలస్యము చేయుచున్నాడు. మిమ్మును కరుణింపవలెనని ఆయన నిలువబడియున్నాడు. యెహోవా న్యాయముతీర్చు దేవుడు. ఆయన నిమిత్తము కనిపెట్టుకొనువారందరు ధన్యులు (యెషయా 30:18).

20. యాకోబు వంశమునకు తనముఖమును మరుగుచేసికొను యెహోవాను నమ్ముకొను నేను ఎదురు చూచుచున్నాను. ఆయన కొరకు నేను కనిపెట్టుచున్నాను (యెషయా 8:17).

21. రాజులు నిన్ను పోషించు తండ్రులుగాను, వారి రాణులు నీకు పాలిచ్చు దాదులుగాను ఉండెదరు. వారు భూమిమీద సాగిలపడి నీకు నమస్కారము చేసెదరు. నీ పాదముల ధూళి నాకెదరు. అప్పుడు నేను యెహోవాననియు, నాకొరకు కనిపెట్టుకొనువారు అవమానము నొందరనియు నీవు తెలిసికొందువు (యెషయా 49:23).

22. జనముల వ్యర్థ దేవతలలో వర్షము కురిపింప గలవారున్నారా? ఆకాశము వాననియ్యగలదా? మా దేవుడవైన యెహోవా! నీవేగదా దాని చేయుచున్నావు! నీవే ఈ క్రియలన్నియు చేయుచున్నావు నీ కొరకే మేము కనిపెట్టుచున్నాము (యిర్మీయా 14:22).

23. నరులు ఆశకలిగి యెహోవా అనుగ్రహించు రక్షణకొరకు ఓపికతో కనిపెట్టుట మంచిది (విలాప 3:26).

24. కాబట్టి యెహోవా సెలవిచ్చు వాక్కు ఏదనగా– 'నాకొరకు కనిపెట్టుడి. నేను లేచి యెర పట్టుకొను దినము కొరకు కనిపెట్టి యుండుడి. నా ఉగ్రతను, నా కోపాగ్ని అంతటిని వారిమీద కుమ్మరించుటకై అన్యజనులను పోగుచేయుటకును, గుంపులు గుంపులుగా రాజ్యములను సమకూర్చుటకును నేను నిశ్చయించుకొంటిని. నా రోషాగ్నిచేత భూమియంతయు కాలిపోవును (జెఫన్యా 3:8).

25. అది విరువబడిన దినమున, నేను చెప్పినది యెహోవా వాక్కు అని మందలో బలహీనములై, నన్ను కనిపెట్టుకొనియున్న గొర్రెలు తెలిసికొనెను (జెకర్యా 11:11).

26. యెరూషలేమునందు సుమెయోనను ఒక మనుష్యుడు ఉండెను. అతడు నీతిమంతుడును, భక్తిపరుడునైయుండి, ఇశ్రాయేలు యొక్క ఆదరణ కొరకు కనిపెట్టువాడు. పరిశుద్ధాత్మ అతనిమీద లఉ ండెను (లూకా 2:25).

27. తమ ప్రభువు పెండ్లివిందునుండి వచ్చి తట్టగానే, అతనికి తలుపుతీయుటకు అతడెప్పుడు వచ్చునో అని, అతనికొరకు ఎదురు చూచు మనుష్యులవలె ఉండుడి (లూకా 12:36).

28. మనము చూడనిదానికొరకు నిరీక్షించినయెడల, ఓపికతో దానికొరకు కనిపెట్టుదుము (రోమా 8:25).

## సన్నిధి కూటము

***దైవసన్నిధికూట వివరము:*** క్రైస్తవులలో కొందరు ప్రతిదినము కొంతసేపు దైవధ్యానములో ఉండవలసిన మీటింగు పెట్టుకొనుచున్నారు. ఆ మీటింగులోనికి

1) ఒకరోజు క్రీస్తుప్రభువు వచ్చి కనబడును. చెప్పవలసిన సంగతులు చెప్పును. అడుగు ప్రశ్నలకు జవాబు వినిపించును.

2) ఇంకొకనాడు ఆయన దేవదూతలలో ఒకరిని పంపును. ఆ దూత కనబడును. వార్త చెప్పును. అడిగిన ప్రశ్నలకు జవాబు వినిపించును.

3) మరియొకనాడు ఆయన పరలోక భక్తులలో ఒకరిని పంపును. ఆ ఒకరు కనబడుదురు, చెప్పవలసిన సంగతులు చెప్పుదురు. అడిగిన ప్రశ్నలకు జవాబు వినిపింతురు.

4) వేరొకనాడు ఆయన భూలోక విశ్వాసులలో ఒకరి ఆత్మను పంపును. ఆ యాత్మ నరరూపములో కనబడును. సంగతులు చెప్పును. అడిగిన ప్రశ్నలకు జవాబు వినిపించును.

5) ఇంకను మరియొకనాడు ఆయన పాతాళ లోకములోని మృతులలో ఒకరిని పంపును. ఆ మృతులు మోక్షమునకు వెళ్ళనివారు. ఆ ఒకరు కనబడుదురు, సంగతులు చెప్పుదురు. అడిగిన ప్రశ్నలకు జవాబు వినిపింతురు.

6) తుదకు ఒక భూతమును రానిచ్చును. ఆ భూతము కనబడును, సంగతులు చెప్పును. అడిగిన ప్రశ్నలకు జవాబు వినిపించి వెళ్ళిపోయిన తరువాత క్రీస్తుప్రభువు వచ్చి, మీరు భూతము పలికిన మాటలు నమ్మకుడి, భయపడకుడి అని చెప్పి ఆదరించును.

షరా:- ***బైబిలులోని వాక్యముల అర్ధములు క్రీస్తు ప్రభువు చెప్పును. ఇది దైవపూజయై యున్నది. శక్తిపూజకాదు.*** ఇద్దరు ముగ్గురు ఎక్కడ నా నామమున కూడుకొందురో, అక్కడ నేనుందునని ప్రభువు చెప్పినమాట మాకు ఆధారము. బైబిలులోని విశ్వాసులకు ఆయన కనబడిన విధముగానే నేడును ప్రభువు విశ్వాసులకు కనబడును. ఒకానొకప్పుడు ఆయన అవిశ్వాసులకుకూడ కనబడి మాటలాడును.

క్రీస్తుయొక్క రెండవరాకడ మిక్కిలి సమీపముగా నున్నది. గనుక ఆయన మేఘాసీనుడై వచ్చి, భూమిమీదనున్న భక్తులను

ప్రాణముతో తీసికొని వెళ్ళనైయున్న సమయము మిగుల సమీపించినది గనుక సిద్ధపడండి. ***అందుకే ఈ కూటములు, ఈ పత్రికల ప్రచురణలు.***

లోకములోనున్న ఏ మతస్థులైనా సరే, సన్నిధి కూటములు పెట్టుకొనవలెని మా కోరిక. క్రీస్తు పేరు ఎత్తుట ఇష్టము లేనివారు– 'దేవా! సృష్టికర్తా! మాకు కనబడి మాటలాడుమని' ప్రార్థింపవచ్చును. *ఏ మతమునైనను దూషింపరాదు. తెలియని సంగతులు దేవునిని అడిగి తెలుసుకొనవలెను.*

**(1) స్థలము :–** గుంటూరునకు 8కి.మీ. దూరమున, మంగళగిరి రోడ్డున కీ॥శే॥ జె. రాజారావుగారి కాకానితోట. (2) **కాలము:–** ప్రతి సోమవారము ఉ॥ 9గం॥ల నుండి సాయంకాలము 5గం॥ల వరకు. (3) **వారము:–** ఇక్కడికి ప్రతి సోమవారము నలుగురు బైబిలు మిషను పాదుర్లు వచ్చి అనారోగ్యవంతులకు క్రీస్తు బోధలు, ప్రార్థనలు, కీర్తనలు నేర్పింతురు. క్రీస్తు ప్రభావమువలన పాపులకు, రోగులకు, బీదలకు, బిడ్డలు లేనివారికి, భూతపీడితులకు, అప్పులు పాలైనవారికి, కోర్టులో వ్యాజ్యములు గలవారికి, తప్పిపోయిన వస్తువులు గలవారికి, పెళ్ళి సమకూడనివారికి, కుటుంబ కలహములు గలవారికి, ఉద్యోగములు లేనివారికి, విషపు పురుగులవల్ల బాధపడువారికి, పశ్వాదులకు ***మేలు కలుగుచున్నది.*** కొందరికి వెంటనే, మరికొందరికి ఇంటియొద్ద స్వస్థత కలుగుచున్నది. తమ కోరికలు నెరవేర్చుకొనగోరువారు పాప కార్యములు ఇతర పూజలు మానివేసి క్రీస్తును మాత్రమే పూజింపవలెను. ***బోధ వినిపించుట పాదుర్ల పని నమ్మట ప్రజలపని బాగుచేయుట క్రీస్తు ప్రభువు పని.*** క్రీస్తు ఎంత దేవుడైనను మన నిమిత్తమై నరుడుగా జన్మించి, మోక్షమార్గము బోధించి, ఔషధములు లేకుండా తన ప్రభావము వలననే వ్యాధిగ్రస్తులను స్వస్థపరచి, ఆకలిగా నున్నవారికి ఆహారము కల్పించి,

ఆపదలోనున్నవారిని విమోచించి, మాదిరికి మృతులలో కొందరిని బ్రతికించి, ఇట్లు అనేకమైన ఉపకారములు చేసెను. అయినను ఆయన దేవుడని గ్రహింపనివారు ఆయనను సిలువకు అంటగొట్టి క్రూరముగా చంపిరి. ఆయన వారిని నాశనము చేయలేదు. ఎందుకనిన, ఆయన లోకమును రక్షించుటకు వచ్చెను. మూడవదినమందు బ్రతికివచ్చి, నలుబది దినములు మరికొన్ని ధర్మములు బోధించి, మోక్షలోకమునకు వెళ్ళెను. ఆయన వెళ్ళకముందు తన శిష్యులతో ఇట్లు చెప్పెను: 'నేను మరలావచ్చి మిమ్మును తీసుకొని వెళ్ళుదును. అంతవరకు నా విషయములను లోకములోనున్న వారందరికి బోధించుడి, నమ్మి బాప్తిస్మము పొందువాడు రక్షింపబడును'.

ప్రియులారా! ఆయన మేఘాసీనుడై వచ్చి, భూమిమీద నున్న భక్తులను ఆకర్షించి మోక్షమునకు తీసుకొని వెళ్ళును. ***ఆ సమయము మిగుల సమీపించినది. కనుక సిద్ధపడండి.*** ఎన్నో పరోపకారములు చేసిన క్రీస్తుప్రభువును మీరు నమ్మి ప్రార్థించినయెడల, మీ కోరికలన్నియు నెరవేర్చును. ఈ సంగతులన్నియు ఉన్న బైబిలును చదువుకొనండి. *మీకు శుభముకలుగును గాక!* ఆమేన్.

# జ్ఞానాత్మ యత్నము

ప్రియులారా! దేశీయులారా! సృష్టికర్తయైన దేవుని నామమును బట్టి మీకు శుభము కలుగునుగాక!

**ప్రార్థన క్రమము:-** 1) మోకాళ్ళూని కన్నులు మూసికొని చెడ్డసంగతులు గాని, మంచి సంగతులుగాని తలంపక, క్రీస్తుప్రభువుని మాత్రమే తలంచుకొనండి. 2) తలంపులోను, మాటలలోను, క్రియలలోను గల పాపములు ఒప్పుకొనండి. 3) 'నాకు తెలిసిన పాపములు ఇకమీదట చేయకుండా ఉండుటకు ప్రయత్నింతును' అని

ప్రమాణము చేయండి. 4) 'నాకు కలిగియున్న శరీరమును, ప్రాణమును, ఆత్మను, అన్న వస్త్రాదులను, ధనమును, ఆస్థిని, ఇంటిని నీకు స్వాధీనము చేయుచున్నాను' అని చెప్పండి. 5) క్రీస్తు తొలగించిన కష్టములను తలంచుకొని ఆయనను స్తుతించండి. 6) క్రీస్తు చేసిన మేళ్ళు తలంచుకొని ఆయనను స్తుతించండి. 7) ***మీ కోరికలన్నియు చెప్పుకొని అడుగవలసినవన్నియు అడుగండి.*** 8) ఇప్పుడు ఆయన జవాబు కొరకు కనిపెట్టండి.

**కనిపెట్టు క్రమము:-** దేవా! నాకు కనబడుము, నాతో మాట్లాడుము అందరికి కనబడుము, అందరితోను మాటలాడుము అందరికిని నీ విషయము తెలియపర్చుము నా ప్రశ్నలకు జవాబు చెప్పుము అని మరియొకమారు ప్రార్థించండి. అప్పుడు ఏమి జరుగునో వినండి. 1) *క్రీస్తుప్రభువు మహిమ శరీరముతో మీకు కనబడును, మీతో మాటలాడును. మీ ప్రశ్నలకు జవాబులు చెప్పును.* అవి మీరు వ్రాసికొనండి. మరియొకసారి ఆయన దేవదూతలను పంపును. వారు మీతో మాటలాడుదురు. మీ ప్రశ్నలకు జవాబులు చెప్పుదురు. అవికూడ మీరు వ్రాసికొనండి. 3) ఇంకొకసారి ఆయన పరలోక పరిశుద్ధులను పంపును. వారు మీతో మాటలాడుదురు. మీ ప్రశ్నలకు జవాబులు చెప్పుదురు. అవి మీరు వ్రాసికొనండి. 4) వేరొకమారు ఆయన భూలోక పరిశుద్ధుల ఆత్మలను పంపును. వారు మీతో మాటలాడుదురు. మీ ప్రశ్నలకు జవాబులు చెప్పుదురు. అవి మీరు వ్రాసికొనండి. 5) తరువాత ఆయన అవిశ్వాసుల ఆత్మలనుకూడ పంపవచ్చును. వారు మీతో మాటలాడుదురు. మీ ప్రశ్నలకు జవాబులు చెప్పుదురు. అవి మీరు వ్రాసికొనండి. 6) అటుతరువాత ఆయన పాతాళములోని మారని మృతుల ఆత్మలను పంపవచ్చును. వారు మీతో మాటలాడుదురు. అవి వ్రాసికొనండి. 7) పిమ్మట ఆయన ఒక

భూతమును పంపవచ్చును. ఆ భూతము మీతో మాటలాడును. మీ ప్రశ్నలకు జవాబులు చెప్పును. అవి వ్రాసికొనండి. 8) అటుపిమ్మట ప్రభువువచ్చి *భూతముచెప్పిన మాటలు నమ్మకండి. ఆ మాటలకు బెదరకండి అని చెప్పి ఆదరించును.*

షరా:- క్రీస్తుప్రభువు మీకు ఏదైనను చూపవచ్చును. మీరు కోరినప్పుడెల్లా సంస్కారపు భోజనము వడ్డించును. ఇ***వి బైబిలుమిషను బోధలు గనుక మీరు దేవునిని అడిగి సత్యాసత్యములు తెలిసికొనండి.*** ఏ మతస్థులైనను, దీనిలోని పద్ధతులు వాడుకొనవచ్చును. క్రీస్తు అను మాటకు బదులుగా దేవునిపేరు ఎత్తవచ్చును.

## రెండు భావికాల వృత్తాంతములు

1. సంఘము వెళ్ళిపోగానే శేషించినవారికి ఏడేండ్ల శ్రమలు ప్రారంభమగును. అవి లోకమెన్నడును ఎరుగనివి. అవి తప్పించుకొనుటకు భక్తులతో ఏకీభవించుటక క్షేమము. ఈ రెండు సంగతులు చాలా కాలమునుండి చెప్పుచున్నారు. ఇంకను జరగలేదని ఆలస్యము జరుగగూడదు.

2. 1) ఢిల్లీలో త్వరలోనే గొప్ప సంతర్పణ జరుగుననియు, బసయును, ట్రైన్ టిక్కెట్లను ఉచితమే అని గవర్నమెంటువారు చాటించిన యెడల- ఎవరు సిద్ధపడరు! 2) క్రీస్తు ప్రభువు మేఘాసీనుడై వచ్చి భూమిమీద నున్న భక్తుల సంఘమును ప్రాణముతోనే పైకి తీసికొని వెళ్ళి అక్కడ ఏడేండ్లు గొప్ప సంతర్పణ చేయును. గనుక సిద్ధపడండని మేము అనేకమార్లు చెప్పుచున్నను కొందరు కుశల ప్రశ్నలు వేయుచు అశ్రద్ధగా నున్నారు. ఆయన వచ్చుటయు సంఘము వెళ్ళుటయు ఒక్క రెప్పపాటులోనే జరుగును. గనుక అప్పుడు సిద్ధపడుటకు వీలుండదు ఇప్పుడే సిద్ధపడండి.

# సన్నిధి సంపద

## (కనిపెట్టు గంట)

గ్రంథకర్త

**యం. దేవదాసు అయ్యగారు**

**గుంటూరు - 2025 : : చందా : 5:00**

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1968 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1974 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1978 | ప్రతులు | 2000 |
| నాల్గవ | ముద్రణ | 1985 | ప్రతులు | 2000 |
| ఐదవ | ముద్రణ | 1992 | ప్రతులు | 4000 |
| ఆరవ | ముద్రణ | 1998 | ప్రతులు | 5000 |
| ఏడవ | ముద్రణ | 2005 | ప్రతులు | 5000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2009 | ప్రతులు | 5000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2012 | ప్రతులు | 5000 |
| పదవ | ముద్రణ | 2014 | ప్రతులు | 5000 |
| పదకొండవ | ముద్రణ | 2016 | ప్రతులు | 3000 |
| పన్నెండవ | ముద్రణ | 2018 | ప్రతులు | 3000 |
| పదమూడవ | ముద్రణ | 2020 | ప్రతులు | 3000 |
| పదునాల్గవ | ముద్రణ | 2021 | ప్రతులు | 3000 |
| పదిహేనవ | ముద్రణ | 2022 | ప్రతులు | 3000 |
| పదహారవ | ముద్రణ | 2023 | ప్రతులు | 3000 |
| పదహేడవ | ముద్రణ | 2024 | ప్రతులు | 2000 |
| పద్దెనిమిదవ | ముద్రణ | 2025 | ప్రతులు | 2000 |

**ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరిచిన**

# బైబిలు మిషను ప్రచురణ

బైబిలుమిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు – **522509.**

ఫోన్: **9949121777.**